

కొత్తగా ఏర్పాటు చేసిన శ్మశానవాటిక ముఖద్వారం

ఆత్మీయులను కోల్పోతే ఆ దుఃఖం మరువలేనిది. అయితే, మృత్యుఒడిలో చేరిన వారికి కడసారి వీడ్కోలు పలికేందుకు రుద్రభూమికి వెళ్లినవారికి అక్కడి పరిస్థితులు మరింత బాధాకరంగా ఉండేవి. ముళ్ల దారిలో చెప్పుల్లేకుండా నడవలేక, వర్షం వస్తే నిలువ నీడ లేక ఎంతో ఇబ్బంది పడేవారు. వారి వెతలను దూరం చేసి శ్మశాన వాటికలో అన్ని వసతులను కల్పించింది గత ప్రభుత్వం. దీంతో నాలుగు దశాబ్దాల చింతను దూరం చేశారని పరిసర ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చివరి మజిలీకి చింత లేదిక..

గత ప్రభుత్వ హయాంలో రూ.38 లక్షలతో వసతులు

నాలుగు దశాబ్దాల అవస్థలకు తెర

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని ప్రధాన హిందూ శ్మశానవాటికలో గత ప్రభుత్వ సహకారంతో అన్ని వసతులు కల్పించడంతో 4 దశాబ్దాలుగా ఉన్న కష్టాలు తొలగాయి. ఇప్పుడు అక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా అంతిమ సంస్కారాలు జరుగుతున్నాయి.

గతంలో ఎంతో ఘోరం..

ఇక్కడి శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు ఉండేవి కావు. మృతుల కుటుంబసభ్యులు ఎంతో దుఃఖంతో మృతదేహాన్ని దహనం లేక ఖననం చేసేందుకు తీసుకువస్తే లోపల నేల మొత్తం ముళ్లు, రాళ్లతో ఉండేది. కాగా లోపలికి వెళ్లేవారు చెప్పులు లేకుండా వెళ్లవలసి ఉండగా.. అందరూ నరకం చూసేవారు. దానికి తోడు మృతదేహాలను దహనం చేయడానికి ఎటువంటి ప్లాట్‌ఫాం ఉండేది కాదు. దీంతో వర్షాలు పడే సమయాల్లో దహనం చేయవలసి వస్తే వారి ఇబ్బందులు చెప్పనలవి కాదు. ఈ పరిస్థితి గురించి ఎవరు ఎన్ని విధాలుగా ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. రానురాను పరిస్థితులు మరింత ఘోరంగా తయారయ్యాయి.

రూ.38 లక్షలతో పనులు

ఇలాంటి దారుణమైన పరిస్థితుల గురించి గత ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో తక్షణం స్పందించింది. శ్మశానవాటిక అభివృద్ధికి రూ. 38లక్షలు మంజూరు చేయడమే కాకుండా ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే నిధులను విడుదల చేయడంతో అవసరమైన అన్ని పనులు చకచకా జరిగిపోయాయి, అప్పటివరకు రుద్రభూమికి అసలు రక్షణ గోడే లేదు. దీంతో చాలా ఇబ్బందిగా ఉండేది. కానీ, ఇప్పుడు శ్మశానవాటికకు ముఖద్వారం, గేటు, శ్మశానం చుట్టు ఎత్తయిన ప్రహరీ గోడ నిర్మించారు. లోపల నడవడానికి ఎవరూ ఇబ్బంది పడకుండా అన్ని వైపులా సిమెంట్ మార్గాలను ఏర్పాటు చేశారు, మృతదేహాలను దహనం చేయడానికి సదుపాయంతో కూడిన దహన వాటిక ఏర్పాటు చేశారు. అలాగే ఇక్కడికి వచ్చే జనం వేచి ఉండడానికి ఒక షెల్టర్‌ను ఏర్పాటు చేశారు, దీంతో వర్షాలు పడే సమయాల్లోనూ ఎటువంటి సమస్యలు ఉండవు. ఇలా ఇక్కడ అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి, 2023 డిసెంబర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అప్పటివరకు ఉన్న అన్ని సమస్యలు, కష్టాలు తొలగిపోయాయి. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ ఉన్న ఈ దారుణ పరిస్థితులు గత ప్రభుత్వ చొరవతో చక్కబడ్డాయి. అందరికీ ఎంతో సదుపాయంగా ఉంది.



శ్మశానానికి వచ్చిన వారు వేచి ఉండడానికి నిర్మించిన షెల్టర్



మృతదేహాలను కాల్చడానికి ఏర్పాటు చేసిన దహన వాటిక

గత ప్రభుత్వ సహకారం మరువలేం



ఇక్కడ శ్మశానంలో పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. ఆప్తులు, బంధువులు చనిపోయినప్పుడు ఇక్కడికి వచ్చి కార్యక్రమాలు చేయాలంటే.. ఈ బాధ అందరినీ మరింత బాధించేది. దీని గురించి ఎన్నో సార్లు అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. కానీ, గత ప్రభుత్వం స్పందించి అన్ని వసతులు కల్పించింది. వారి సహకారం మరువలేం.

– పైల రాము, భీమిలి

ప్రత్యేక కృతజ్ఞతలు

ఇంతవరకు ఎవరూ పట్టించుకోని ఈ సమస్యను తెలుసుకుని వెంటనే నిధులు మంజూరు చేయడంతో పాటు పనులను కూడా తక్కువ వ్యవధిలోనే చేయించారు. ఇప్పుడు ఎవరూ ఇబ్బంది పడకుండా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నా రు. దీనికి కారణమైన గత ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.



– రాంబోతు సత్యనారాయణ, భీమిలి



ఒకప్పుడు లోపల పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో ఉన్న పరిసరాలు (నాడు)



ఇప్పుడు అదే ప్రాంతంలో చక్కగా సిమెంట్‌తో వేసిన నడిచే మార్గాలు (నేడు)

పెన్షనర్ల సమస్యలపై ఎంపీకి వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల సంఘ కార్యవర్గం పెన్షన్ సమస్యలపై మంగళవారం ఎంపీ శ్రీభరత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈపీఎఫ్–95 పెన్షన్ పెరుగుదల ఆవశ్యకత గురించి వివరించారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలను తట్టుకుని పెన్షనర్లు రూ.1000 పెన్షన్‌తో నెట్టుకు రావడం కష్టమని తెలిపారు. పెన్షన్ పెంపుతో పాటు ఆరోగ్య కార్డులు, రైల్వే రిజర్వేషన్‌లో రాయితీ కల్పించే విధంగా పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు.

కేజీబీవీ విద్యార్థినులకు వృత్తివిద్య శిక్షణ సర్టిఫికెట్లు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులోని కేజీబీవీ విద్యార్థులకు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ జోగ చంద్రశేఖరరావు మంగళవారం వృత్తివిద్య శిక్షణ సర్టిఫికెట్లు అందించారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులకు వృత్తి విద్య శిక్షణలో భాగంగా వేములవలస బాలాజీ బేకరీలో సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లో కేక్‌లు, కుకీస్, పేస్ట్రీస్ తయారీలో 10 రోజుల శిక్షణ ఇచ్చినట్టు జీసీడీవో ఖాలేషా బేగం తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, వృత్తి శిక్షణకర్త స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో బుధవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కేంద్రంలో 107 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ: త్రైత సిద్ధాంత భగవద్గీతపై మధురవాడలో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, అప్పారావు, రమణ, మహాలక్ష్మి, మంగ, సరిత, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న చంద్రశేఖర్

తగరపువలస: బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రేడ్‌కు సంబంధించి 12 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో చంద్రశేఖర్, జీసీడీవో ఖాలేషా బేగం, ఒకేషనల్ కో–ఆర్డినేటర్ రిషికేష్, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పట్నాయక్, వృత్తివిద్య ఉపాధ్యాయిని అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం ప్రాథమిక పాఠశాల వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కొక్క తరగతిలో అధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు సునీత, ఆదిబాబులను గ్రామస్తుల తరఫున సర్పంచ్ ఈగల అరుణ కుమారి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

లక్ష్మివానిపాలెంలో తాగునీటికి కటకట

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పీఎం పాలెం లక్ష్మివానిపాలెంలో తాగునీటి సమస్య నెలకొంది. ఇక్కడ ప్రజల అవసరాల మేరకు జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం నీటిని సరఫరా చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయడంతో తాగునీటి కోసం అల్లాడి పోతున్నామని పేర్కొన్నారు. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం ఇంటింటి కుళాయిల ఏర్పాటులో భాగంగా పైపులైన్లు ఏర్పాటు చేసింది. అయితే, వాటి ద్వారా సరిపడినంత నీరు సరఫరా చేయకపోవడం వల్లనే సమస్య వస్తోంది. వాడుక నీటి అవసరాల కోసం ఈ ప్రాంతంలో బోర్‌వెల్స్ కూడా లేకపోవడం మరింత సమస్యాత్మకంగా మారింది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, రోజూ సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, బోర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూలకు చేరిన బోరు



మరమ్మతులకు గురైన బోరు

పీఎం పాలెం: జీవీఎంసీ 7వ వార్డు మొగదారమ్మ ఆలయానికి సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నిర్మించిన మంచినీటి బోరు మరమ్మతులకు గురవడంతో, మూలకు చేరింది. కాలనీ ప్రజల మంచినీటి అవసరాల కోసం ఓ స్వచ్ఛంద సంస్థ కాలనీలో బోరు ఏర్పాటు చేసి, చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించి కాలనీవాసులకు అప్పగించింది. కొంతకాలం బాగానే పని చేసినా, తర్వాత పాడవడంతో ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉంది. పట్టించుకునే వారు లేక అలంకారప్రాయంగా మిగిలింది. జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది స్పందించి బోరుకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తేవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆసక్తికి అనుగుణంగా అడుగేస్తే విజయం మీదే..



విద్యార్థినులతో సంస్థల ప్రతినిధులు

భీమునిపట్నం: విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా అడుగులు వేస్తే తప్పక విజయం సాధించగలరని వక్తలు సూచించారు. భవిష్యత్ ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలన్న అంశంపై భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖకు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్, వైజాగ్ వలంటీర్స్ కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు ఉషాకర్ కీర్తి, నాగేంద్ర, దినేష్ తదితరులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఏ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి? వాటిని పొందడానికి ఏ విధానాలతో వెళ్లాలి అనేది వివరించారు. ముందు ఎవరికి దేనిపై ఆసక్తి ఉందో గమనించాలన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని కృషి చేస్తే అనుకున్నది సాధించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకులు మయూర్ పట్నాల, ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందన



నర్సింగరావును అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

కొమ్మాది: నేపాల్‌లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాగర్‌నగర్‌కు చెందిన ఆడారి నర్సింగరావుకు ప్రథమ బహుమతి లభించింది. సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో నేపాల్‌లో పోఖ్రా నగరంలోని రంగస్థల అంతర్జాతీయ క్రీడా మైదానంలో నిర్వహించిన మాస్టర్స్ 60 సంవత్సరాల విభాగంలోని పోటీల్లో ప్రథమ బహుమతి రావడం ఎంతో ఆనందం ఇచ్చిందని నర్సింగరావు తెలిపారు. ఆయనను ఎంపీ ఎం. శ్రీభరత్ అభినందించారు.

రాజకీయాలైనా, జీవితమైనా నిబద్ధత అవసరం

- పదవి ఒక అలంకారం మాత్రమే
- వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాం
- 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి



తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశ్వసనీయంగా ఉండటం అదృష్టమని జీవీఎంసీ 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి అన్నారు. ఇటీవల జీవీఎంసీ రాజకీయ పరిణామాలపై మంగళవారం ఆమె సంగివలసలో మాట్లాడారు. రాజకీయాలైనా, మానవ సంబంధాలైనా నిబద్ధత, విశ్వాసం నిరూపించుకునే సందర్భాలు అరుదుగా వస్తాయన్నారు. కష్టకాలంలో తోడు ఉండకుండా, అంతా జరిగిపోయిన తరువాత ఎన్ని కబుర్లు చెప్పినా, అగ్ని పరీక్షలకు సిద్ధమన్నా వృథా ప్రయాసే అన్నారు. కన్నతల్లిలాంటి పార్టీ తనకు రాజకీయ జీవితం, పదవి ఇచ్చిందన్నారు. దీనికి తాను నిత్యం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. ప్రజా సమస్యలను అధికారులు, అగ్రనాయకుల దృష్టికి తీసుకువెళ్లడానికి పదవి ఒక అలంకారం మాత్రమే అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలు నెరవేరుస్తూ, ప్రజలకు మేలు చేయాలని చూస్తున్న వైఎస్ జగన్ వెంట మొదటి నుంచి తన తండ్రి అక్కరమాని మంగరాజుతో నడుస్తున్నట్లు తెలిపారు. ఒక మహిళగా మరో యాదవ మహిళను గద్దె దించిన కూటమి ప్రభుత్వ అనైతికత్వాన్ని ఖండిస్తున్నానన్నారు. తనకు సొంత ప్రయోజనాల కంటే ప్రజా సమస్యలు, వైఎస్సార్‌సీపీయే ముఖ్యమన్నారు.

కళాశాలలో ఇనుప దూలాల తరలింపునకు యత్నం



తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఇనుప దూలాలు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరుపయోగంగా ఉన్న ఇనుప దూలాలను ఎవరికీ తెలియకుండా తరలించి, విక్రయించడానికి మంగళవారం ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ ప్రయత్నించినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కి, విలేకరులు అక్కడికి చేరుకోవడంతో తరలింపును నిలిపివేశారు. వివరాలివి.. భీమిలిలో కళాశాల భవనాన్ని అప్పట్లో బ్రిటిషర్లు ఎంతో పటిష్టంగా నిర్మించారు. అందులో భాగంగా చాలా గట్టి ఇనుప దూలాలను నిర్మాణంలో వాడారు. అయితే ఈ భవనాలు దెబ్బతినడంతో కొత్త భవనాన్ని నిర్మించిన సమయంలో పాత ఇనుప దూలాలను కళాశాల వద్ద ఒకచోట ఉంచారు. అయితే, పద్ధతి ప్రకారం వీటిని విక్రయించాలంటే అధికారులకు సమాచారం ఇచ్చిన అనంతరం వేలం వేయాలి. అంతేగానీ వీటిని విక్రయించడం, బయటకు తరలించడం చేయకూడదు. కానీ ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ ఎవరికీ తెలియకుండా కొంతమందితో బేరం కుదుర్చుకుని, వీటిని తరలించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. విషయం తెలిసి విలేకరులు వెళ్లేసరికే వ్యాన్ ద్వారా దూలాలు తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, విలేకరులు అక్కడికి చేరుకోవడంతో వీటి తరలింపును నిలిపివేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్‌ను దీనిపై ప్రశ్నించగా తాను వీటిని విక్రయించడానికి ప్రయత్నించలేదన్నారు. వీటిని తూకం వేయించడానికి పంపుతున్నానని, తరువాత వేలం వేయాలని అనుకున్నానని తెలిపారు.

రైతుబజారు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో రైతు బజారు ఏర్పాటుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పలు చోట్ల స్థలాలను పరిశీలించారు. ఎండాడ, దుర్గానగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో ఎక్కడ రైతుబజారు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రుషికొండలో శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ రక్షిత భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ భవనాన్ని తొలగించి, దీని స్థానంలో కల్యాణ మండపం నిర్మించాలని స్థానిక నాయకుడు ఎ.రాంబాబు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో సంగీత్ మాథూర్, జెడ్పీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపిల్లి గోపి తదితరులున్నారు.

ఉపాధ్యాయినికి సాదర వీడ్కోలు



ఉపాధ్యాయిని ఫాతిమా జెసింతను సత్కరిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ హెచ్ఎం తదితరులు

మధురవాడ: విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయిని ఫాతిమా జెసింత సేవలు ఎనలేనివని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.రవి, ఇతర ఉపాధ్యాయులు కొనియాడారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా సేవలు అందించిన జెసింత ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమెకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. విద్యాశాఖలో 34 సంవత్సరాల పాటు ఆమె అందించిన సేవలు పలువురికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయిని కెజియాకు..

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న వైవీ కెజియా మే 31న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాలలో మంగళవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎంఈవో జోగేంద్రనాథ్, ప్రధానోపాధ్యాయుడు కేఆర్కే పట్నాయక్, స్థానిక పెద్దలు చందక సూరిబాబు, బంటుపల్లి అప్పలస్వామి, రెడ్డి బాబు, కొట్యాడ సత్యమూర్తి, బంటుపల్లి లక్ష్మి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చందనోత్సవంలో వృద్ధులకు ప్రత్యేక దర్శనాలు కల్పించాలి

తగరపువలస: ఈ నెల 30న జరగనున్న సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవంలో దివ్యాంగులు, వృద్ధుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు దేవదాయశాఖకు లేఖ రాశారు. లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అర్హులైన భక్తులకు వెబ్‌సైట్ ద్వారా ఉచిత దర్శన పాస్‌లు మంజూరు చేయాలని కోరారు. దివ్యాంగులు కొండపైకి చేరేందుకు ఒక సహాయకుడిని నియమించాలన్నారు.

ఉర్సాకి భూముల కేటాయింపుపై విష్ణుకుమార్‌రాజు స్పందించాలి

జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

మధురవాడ: నకిలీ ఐటీ కంపెనీ ఉర్సాకి విశాఖ ఐటీ సెజ్ మధురవాడ హిల్ నెంబర్–3లో ఉన్న విలువైన భూములు కేటాయించడంపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పందించాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీకనర్ ఎస్ఎల్ఎన్ వాసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటనతో పాటు వీడియో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నిరుద్యోగులకు ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ పెట్టి, నకిలీ యుఆర్ఎస్ఏ ఐటీ కంపెనీ పేరుతో రూ. 3వేల కోట్లు విలువ చేసే 60ఎకరాల భూములు ఇష్టారాజ్యంగా కేటాయించడం అధికారికంగా కబ్జా చేయడమేనన్నారు. ఈ వ్యవహారంపై బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు స్పందించకపోతే కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

శ్మశానవాటికలో సమస్యల తిష్ట



కర్ర సహాయంతో నిలబెట్టిన గేటు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశానవాటిక నిర్వహణను జీవీఎంసీ సిబ్బంది గాలికి వదిలేశారు. దీంతో ఇక్కడ పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు, ప్రధాన ద్వారం వద్ద గేటు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే దీనిని కర్రల సాయంతో నిలబెట్టారు. ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



శృంగేరీ శంకర మఠంలో పూజలు అందుకుంటున్న స్వామి

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాప్ నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువుదీరిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు. మఠం గౌరవ ధర్మాధికారి జె.వెంకటేశ్వర్లు పూజలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పార్కుల్లో నాసిరకం క్రీడాపరికరాలు



చిల్డ్రన్స్ పార్కులో విరిగిపోయిన ఆట వస్తువులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పార్కులలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు నాసిరకానివి కావడంతో, వీటి మనుగడ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతోంది. దీనికి ఒకటో వార్డు కొండపేట కొండపై ఉన్న పార్కునే ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంజినీరింగ్ సిబ్బంది తాత్కాలికంగా కొన్ని ఆటవస్తువులు మాత్రం ఇక్కడ ఏర్పాటు చేశారు. తరువాత పలు వార్తాకథనాలు వెలువడటంతో చిన్నారులకు ఊయలలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై కనీసం పది నెలలైనా గడవక ముందే కొండపేట పార్కులో పలు ఆటవస్తువులు విరిగి, వాలిపోయాయి. దీంతో విరిగిన ఆటవస్తువులు ఎక్కడ తమ చిన్నారులపై పడతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెంది పిల్లలను పార్కులలోకి వెళ్లనీయడం లేదు. చిన్నారులు ఆటలాడుకునే ఆట వస్తువుల ఏర్పాటులోనూ కక్కుర్తేనా అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.